సాక్షి సూర్యాపేట

శుక్రవారం। 14 । జూన్ । 2024



నిందితుడి అరెస్ట్

చిన్నారిని హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. - 8లో



హుండీ ఆదాయం రూ.57,13,100

చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. - 8లో

గరిష్టం / కనిష్టం

38° / 24°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మిషన్ భగీరథ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



హుజూర్‌నగర్ : చింతలపాలెంలో ప్రజలతో మాట్లాడుతున్న డీపీఓ సురేష్ కుమార్

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) సురేష్ కుమార్ సూచించారు. చింతలపాలెంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ ఇంటింటి నల్లా సర్వే తీరును గురువారం ఆయన పరిశీలించారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయా లేదా ఒకవేళ వస్తే ఎన్ని వస్తున్నాయి? ఎంత సేపు వస్తున్నాయి? అని ఆరా తీశారు. పారిశుద్ధ్య పనులు ఎలా జరుగుతున్నాయి? గ్రామపంచాయతీ ట్రాక్టర్ వస్తుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీపీఓ మాట్లాడుతూ మురుగు కాల్వలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట ఎంపీడీఓ పవన్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, సిబ్బంది ఉన్నారు.

మత్స్య ఉత్పత్తిలో అగ్రగామిగా నిలపాలి



మాట్లాడుతున్న రూపేందర్‌సింగ్

కూసుమంచి: తెలంగాణ రాష్ట్రాన్ని మత్స్య ఉత్పత్తిలో అగ్రగామిగా నిలిపేలా మత్స్యకారులు కృషి చేయాలని సూర్యాపేట జిల్లా మత్స్య శాఖ అధికారి టి.రూపేందర్ సింగ్ సూచించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులోని పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల మత్స్య రైతులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా రూపేందర్ మాట్లాడుతూ మత్స్యకారులకు పాలేరులో అందిస్తున్న శిక్షణ వారిలో నైపుణ్యాలు పెరగడానికి దోహదం చేస్తుందన్నారు. అనంతరం పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, శాస్త్రవేత్త రవీందర్ వివిధ అంశాలపై మాట్లాడారు.

టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు



రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి



అంబేడ్కర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

భానుపురి (సూర్యాపేట) : తెలంగాణ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు దక్కింది. టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శిగా పడిదల రవికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మరికంటి అంబేడ్కర్‌లను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ గురువారం నియమించారు. రవికుమార్‌కు సంఘం జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలు కూడా అప్పగించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ మాదిగలకు, మాదిగ ఉప కులాలకు బీజేపీ ప్రభుత్వం న్యాయం చేయడంలో విఫలమైందన్నారు. తమపై నమ్మకం ఉంచి నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

మట్టపల్లి క్షేత్రంలో నృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణలతో గురువారం విశేషంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ప్రాతఃకాలార్చన, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లను నూతన పట్టువస్త్రాలతో వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. కల్యాణవేడుకలో భాగంగా విష్వక్సేనారాధన , రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడవాహనంపై ఆలయ తిరు వీధుల్లో ఊరేగించారు. ఆలయ ప్రవేశానంతరం నీరాజన మంత్ర పుష్పాలతో మహానివేదన గావించారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు

సూర్యాపేటటౌన్ : టీజీ ట్రాన్స్‌కో, డిస్కమ్ ఉద్యోగుల అంతర్ రాష్ట్ర కబడ్డీ, చెస్ పోటీలను గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ట్రాన్స్‌కో ఎస్ఈ సీహెచ్. పాల్‌రాజ్ ప్రారంభించారు. 11 సర్కిల్స్ పరిధిలోని 16 కబడ్డీ టీములు,16 చెస్ టీములు పాల్గొంటున్నాయి. రెండు రోజుల పాటు పోటీలు కొనసాగనున్నాయి. మొదటి పోటీలు హోరాహోగా సాగాయి. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ క్రీడాపోటీల నిర్వహణ వల్ల విద్యుత్ ఉద్యోగుల్లో ఐకమత్యం, స్నేహభావం పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారి డానియల్, శ్రీనివాస్, వెంకటకిష్టయ్య, రాజశేఖర్, భీమానాయక్ తదితరులు పాల్గొన్నారు.







సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కబడ్డీలో తలపడుతున్న విద్యుత్ ఉద్యోగులు

ఎల్‌కేజీ @ 45వేలు!

- ప్రైవేట్ స్కూళ్లలో అడ్డగోలుగా ఫీజుల వసూళ్లు
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతర్
- తల్లిదండ్రులకు తడిసిమోపెడవుతున్న ఖర్చు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



సూర్యాపేటకు చెందిన ఓ వ్యక్తి తన కూతురును ఓ ప్రైవేట్ స్కూల్‌లో ఎల్‌కేజీలో జాయిన్ చేయాలనుకున్నాడు. పాఠశాలకు వెళ్లి ఫీజు వివరాలు అడిగాడు. అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, పుస్తకాలు, టై, బెల్టు, యూనిఫాం, రవాణా చార్జీలు కలుపుకొని ఏడాదికి మొత్తం రూ.45వేలు అవుతాయని స్కూల్ యాజమాన్యం చెప్పింది. ఇదీ.. జిల్లాలో ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల ఫీజుల వసూళ్లకు నిదర్శనం.

పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు



ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయించినట్టు మా దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. యూనిఫాం కూడా విక్రయించకూడదు. విక్రయించినట్టు ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసకుంటాం. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– అశోక్, డీఈఓ

సూర్యాపేటటౌన్ : తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలనే లక్ష్యంతో పేరు గాంచిన ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంగ్లిష్ మీడియం అయితేనే పిల్లలకు భవిష్యత్ ఉంటుందని ఆలోచిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఫీజులను ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నాయి. నోట్ పుస్తకాల దగ్గరి నుంచి యూనిఫాం, పుస్తకాలు, షూ, బెల్టు, పెన్ను, పెన్సిల్ వరకు అన్నీ ప్రైవేట్‌లోనే కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తుండటంతో తల్లిదండ్రులకు ఖర్చు తడిసిమోపెడవుతోంది. సర్కారు స్కూళ్లలోనే పిల్లలను చదివించాలంటూ ఓ వైపు ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తుండగా మరో వైపు చాంతాడంతా ఫీజుల లిస్టులతో ప్రైవేట్ బడులు రమ్మని ఆహ్వానిస్తున్నాయి. ఫలితంగా, పేద, మధ్యతగరతి వారి జేబులకు చిల్లులు పడుతున్నాయి. నిబంధనలు బేఖాతరు చేస్తూ ఫీజులు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఎల్‌కేజీకి ఖర్చు(రూ.లలో)	
అడ్మిషన్ ఫీజు	2,000
స్కూల్ ఫీజు	20,000
పుస్తకాలు	5000
టై, బెల్టు, యూనిఫాం	3,000
రవాణా చార్జీలు	15,000

కనీస సౌకర్యాలు కరువు..

విద్యార్థులు చదువుకునే పాఠశాల గదుల్లో వెలుతురు, గాలితో పాటు శుభ్రత ఉండాలి. జిల్లాలో చాలా వరకు ప్రైవేట్ స్కూళ్లు ఇరుకు గదుల్లోనే కొనసాగుతున్నాయి. వెలుతురు లేకపోగా ఫ్యాన్లు కూడా సక్రమంగా తిరగని పరిస్థితి నెలకొంది. చాలా పాఠశాలల్లో పిల్లలు ఆడుకోవడానికి గ్రౌండ్ కూడా లేదు. పిల్లలను ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు పాఠశాల గదుల్లో యాజమాన్యాలు బంధిస్తున్నాయి. దీంతో విద్యార్థుల్లో మానసిక వికాసం తగ్గిపోతుందని మానసిక వికాస నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు ఏర్పాటు చేసే సమయంలో ఆటలు ఆడించడానికి అన్ని వసతులు ఉన్నట్టు అనుమతులు తీసుకుంటారు. కానీ ఏ ఒక్క పాఠశాలకు ఆటస్థలం ఉన్న పరిస్థితి జిల్లాలో కనిపించడం లేదు.

జిల్లాలో 398 ప్రైవేట్ పాఠశాలలు..

జిల్లాలో 398 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 50వేల మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. బయటి మార్కెట్‌లో దొరికే వస్తువుల ధరలకు ప్రైవేట్ పాఠశాలల్లో లభించే వాటికి చాలా వ్యత్యాసం ఉంటోంది. నర్సరీ నుంచి 5వ తరగతి వరకు పుస్తకాలు, బూట్లు, యూనిఫాం, టై, బెల్టు, గుర్తింపు కార్డులు తదితర వాటి పేరుతో ఫీజులు కాకుండా రూ.4వేల నుంచి రూ.10వేల వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో విక్రయించే పాఠ్య పుస్తకాలు మార్కెట్‌లో ఎక్కడా దొరకకుండా జాగ్రత్తపడుతున్నారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

- కలెక్టర్ వెంకటరావు

భానుపురి (సూర్యాపేట) : విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఏ అధికారి, ఉద్యోగిపైన అయినా చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకటరావు హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకతో కలిసి కలెక్టర్ వెబెక్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు. ఏ ప్రభుత్వ శాఖకు చెందిన వారైనా నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని, ఎవరికీ మినహాయింపులు లేవన్నారు. కలెక్టరేట్‌లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. సరిగా పనిచేస్తే ప్రోత్సహిస్తామని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు చేపడుతామన్నారు. కలెక్టరేట్ లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి విధులకు హాజరు కావడం లేదని, అదనపు కలెక్టర్ పరిశీలనలో వెల్లడి కావడంతో ఆ శాఖకు చెందిన జిల్లా అధికారికి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఇకనుంచి జిల్లాలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అధికారులు పనితీరు మార్చుకుని విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరావు

బడి బాటకు నిధులు

- ప్రతి పాఠశాలకు రూ. వెయ్యి చొప్పున మంజూరు
- జిల్లాకు రూ 8.72 లక్షలు విడుదల

హుజూర్‌నగర్ : సర్కారు పాఠశాలలను బలోపేత చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదును పెంచేందుకు ఈ నెల 6 నుంచి బడిబాట కార్యక్రమం ప్రారంభమైంది. ఇది ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగనుంది. పాఠశాలలు పునఃప్రారంభమైనా బడిబాట యథావిధిగా కొనసాగుతుంది. అన్ని గ్రామాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి సర్కారు బడుల్లో అందిస్తున్న వసతులను వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. బడిబాట నిర్వహణలో భాగంగా ప్రతి పాఠశాలలో బ్యానర్లు, కరపత్రాలు తయారు చేయించి ప్రచారం చేస్తున్నారు. బడిబాటలో భాగంగా పాఠశాలలు ప్రారంభం కాగానే విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం, బాలికల విద్య ప్రాముఖ్యతపై సమావేశాలు నిర్వహించనున్నారు. మధ్యలో చదువు మానేసిన పిల్లలను గుర్తించి వారిని కూడా బడిలో చేర్పిస్తున్నారు. ఐదేళ్ల వయసు నిండిన కొత్త విద్యార్థులను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి బడుల్లో చేర్పించడంపై దృష్టి సారించారు.

పీఎఫ్‌ఎంఎస్ ఖాతాలో జమ చేశాం

జిల్లాలో బడిబాట నిర్వహణ నిధులు మంజూరు అయ్యాయి. వాటిని ఆయా పాఠశాలల పీఎఫ్‌ఎంఎస్(పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) ఖాతాలో జమ చేశాం. ఈ నిధులను నిబంధనల మేరకు హెచ్‌ఎంలు వినియోగించుకోవచ్చు. బడిబాట విజయవంతానికి అందరూ కలిసి కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయాలి.

–అశోక్, డీఈఓ, సూర్యాపేట

872 పాఠశాలలకు మంజూరు

బడిబాట నిర్వహణ కోసం బ్యానర్లు, కరపత్రాల ముద్రణ, ఇతర ఖర్చులకు సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు సంచాలకుడు ప్రతి పాఠశాలకు రూ.వెయ్యి చొప్పున మంజూరు చేశారు. జిల్లాలో 872 పాఠశాలలు ఉండగా వాటిలో పాథమిక పాఠశాలలు 606, పాథమికోన్నత పాఠశాలలు 75, ఉన్నత పాఠశాలలు 191 ఉన్నాయి. వాటికి రూ. వెయ్యి చొప్పున మొత్తం రూ 8.72 లక్షలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

అమ్మా నాకు న్యాయం చేయండి

- బావ కొడుకని చేరదీస్తే భూమి కాజేశాడు
- మోతె తహసీల్దార్ ఎదుట గోడు వెల్లబోసుకున్న వృద్ధురాలు
- పురుగుల మందు డబ్బాతో ఆందోళన



తహసీల్దార్‌ను వేడుకుంటున్న వృద్ధురాలు కమలమ్మ

మోతె: తనకు పిల్లలు లేకపోవడంతో బావ కొడుకుని చేరదీస్తే తన భర్త పేరిట ఉన్న భూమిని అక్రమంగా పట్టా చేసుకుని కనీసం తిండి కూడా పెట్టడంలేదని ఓ వృద్ధురాలు పురుగుల మందు డబ్బాతో మోతె తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని తహసీల్దార్ సంఘమిత్ర ఎదుట గోడు వెల్లబోసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన ఎర్ర వెంకట్‌రెడ్డి, కమలమ్మ దంపతులు తమకు ఉన్న 15 ఎకరాల భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వారికి పిల్లలు లేరు. ఆత్మకూర్(ఎస్) మండలం విస్తాల్లపురం గ్రామంలో కమలమ్మ బావ ఎర్ర జానయ్య ఉండేవాడు. జానయ్య కుమారుడు ఎర్ర శ్రీనివాస్‌రెడ్డి చదువుకునే రోజుల్లో ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పి కమలమ్మ ఇంటికి వచ్చి అప్పు రూపంలో డబ్బులు తీసుకెళ్తూ ఉండేవాడు. కమలమ్మ భర్త వెంకట్‌రెడ్డి 2009 నుంచి అనారోగ్యం బారిన పడగా.. హైదరాబాద్‌లో చికిత్స చేయిస్తానని చెప్పి వెంకట్‌రెడ్డిని తీసుకెళ్లాడు. ఈక్రమంలోనే ఎవరికీ తెలియకుండా సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గిఫ్ట్ డీడ్ కింద వెంకట్‌రెడ్డి పేరున ఉన్న 15 ఎకరాల భూమిని పట్టా చేయించుకున్నాడు. 2017లో వెంకట్‌రెడ్డి పేరున రైతుబంధు రాకపోవడంతో ఆరా తీయగా ఆయన భూమిని శ్రీనివాస్‌రెడ్డి పట్టా చేయించుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టించగా.. ఎనిమిది నెలల్లో భూమి పట్టా చేయిస్తానని శ్రీనివాస్‌రెడ్డి ఒప్పుకుని చేయించలేదని బాధితురాలు వాపోయింది. తమకు పిల్లలు లేరు కాబట్టి అన్నీ తానే చూసుకుంటానని శ్రీనివాస్‌రెడ్డి చెప్పేవాడని బాధితురాలు తెలిపింది. తన భర్త 2018లో మరణించాడని, అప్పటి నుంచి ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ డబ్బులతో జీవనం సాగిస్తున్నానని, తన భూమిని ఇప్పించి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ సంఘమిత్ర ఎదుట బోరున విలపించింది.

సర్వీస్ రోడ్డు నిర్మించాలని నిరాహార దీక్ష



ఖమ్మం- కోదాడ రహదారిపై నిరాహార దీక్ష చేస్తున్న రైతులు

కోదాడరూరల్ : నూతనంగా నిర్మిస్తున్న ఖమ్మం –కోదాడ జాతీయ రహదారి నంబర్ 365ఏ వెంట కోదాడ మండలంలోని అల్వాలపురం నుంచి దుర్గాపురం క్రాస్‌రోడ్ వరకు సర్వీస్‌రోడ్డు నిర్మించాలని కోరుతూ అల్వాలపురం, తమ్మర బండపాలెం, గోంద్రియాల రైతులు గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వీస్ రోడ్ లేకపోవడంతో రైతులు, ప్రజలు ఐదు కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రోడ్డుదాటి రావాల్సి ఉంటుందన్నారు. ఇలా రోడ్డుదాటి రావాలంటే ప్రమాదాలు చోటుచేసుకుంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సామినేని రమేష్, సామినేని నరేష్, కనగాల రాధాకృష్ణ, పోతురాజు హరికృష్ణ, గొట్టిముక్కల కోటినారాయణ, వేముల దాసు, అల్వాల నాగేశ్వరరావు, గోవిందు, లక్ష్మీనారాయణ, అప్పారావు, రామకృష్ణా, వేలాద్రి, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలి

హుజూర్‌నగర్ : వర్షాకాలంలో రైతులకు సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలని అఖిలభారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య కోరారు. రైతాంగ సమస్యలపై గురువారం అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో హుజూర్ నగర్ ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైనప్పటికీ రాష్ట్ర, జిల్లా స్థాయిలో వ్యవసాయ ప్రణాళిక నిర్దిష్టంగా ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. హుజూర్‌నగర్ డివిజన్‌లో ఎక్కువ శాతం వరి, అక్కడక్కడా పత్తి, మిర్చి పండిస్తారని తెలిపారు. వీటికి సంబంధించిన విత్తనాలు ఇంకా అందించలేక పోతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు మేకల కనకారావు, కాకి అజయ్, నూకల చంద్రం, సైదులు, వి. నరసింహారావు, గండు వెంకన్న, పెద్ద సాంబయ్య, కోడి సైదులు, లచ్చయ్య, శ్రీను, కొమరయ్య పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్



హుజూర్‌నగర్: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్

హుజూర్‌నగర్ : న్యాయవాదులు నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి మారుతీ ప్రసాద్ సూచించారు. గురువారం హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య అధ్యక్షతన నిర్వహించిన నూతన అడ్వకేట్ జుట్టుకొండ సంధ్య పరిచయ కార్యక్రమంలో జడ్జి మాట్లాడారు. న్యాయవాద వృత్తి కత్తి మీద సాము లాంటిదని, క్రమశిక్షణ, అంకిత భావంతో చేసేది అని పేర్కొన్నారు. పట్టుదలతో పని చేస్తే ఉత్తమ న్యాయవాదిగా పేరుగడించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు నట్టే సత్యనారాయణ, గోపాల కృష్ణమూర్తి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జె .నాగేశ్వరావు, సంయుక్త కార్యదర్శి నగేష్ రాథోడ్, న్యాయవాదులు నారాయణ రెడ్డి, సైదులు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, శంకర్, కొట్టు సురేష్, నాగార్జున, నాగేంద్ర, వెంకటేష్, సైదా హుస్సేన్, రాముడు, నాగూర్ బాషా పాల్గొన్నారు.

ముగిసిన ధాన్యం సేకరణ

- యాసంగిలో 2.40లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు
- టార్గెట్ 3.50 లక్షల టన్నులు
- 99 శాతం రైతులకు బిల్లుల చెల్లింపులు
- తప్పిన వ్యవసాయశాఖ అంచనాలు



జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం(ఫైల్)

కొనుగోలు కేంద్రాలు : 294	సేకరించాల్సిన ధాన్యం : 3.50 లక్షల టన్నులు
సేకరించింది : 2,40,531 టన్నులు	
రైతులకు చెల్లించాల్సిన డబ్బులు : రూ.529.89 కోట్లు	
చెల్లించిన డబ్బులు : రూ.523.24 కోట్లు	

భానుపురి (సూర్యాపేట) : జిల్లాలో యాసంగి సీజన్ ధాన్యం సేకరణ పూర్తయింది. రైతుల నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ దాదాపు 2,40,531 టన్నుల ధాన్యాన్ని సేకరించింది. రైతులకు ఈ ధాన్యానికి సంబంధించిన చెల్లింపులు సైతం దాదాపు 99 శాతం పూర్తి చేశారు. ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలు సమయంలో పెద్దగా ఇబ్బందులు తలెత్తకపోవడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. కాగా కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం విషయంలో జిల్లా వ్యవసాయ శాఖ అంచనాలు తప్పినట్లుగా తెలుస్తోంది. సంబంధిత అధికారులు వేసిన అంచనాల కంటే దాదాపు లక్ష టన్నుల ధాన్యం తక్కువగా కొనుగోలు కేంద్రాలకు అమ్మకానికి వచ్చింది.

294 సెంటర్ల ద్వారా ధాన్యం సేకరణ

సూర్యాపేట జిల్లాలో 2023 యాసంగి సీజన్‌లో 3,85,459 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఇందులో 5,00,081 టన్నులు దొడ్డురకం, 3.82 లక్షల టన్నులు సన్నరకం ఇలా మొత్తం 8,83,333 టన్నుల ధాన్యం దిగుబడి రానుందని జిల్లా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 19,216 మెట్రిక్ టన్నులు స్థానికంగా, 1,500 మెట్రిక్ టన్నులు విత్తనాల కోసం రైతులు వాడుకుంటారని భావించారు. ఇక అమ్మకానికి 8,62,617 టన్నులు వస్తుందని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 3,45,896 టన్నుల ధాన్యం రావొచ్చని సర్కారుకు ప్రతిపాదనలు పంపారు. ఈనేపథ్యంలో జిల్లాలో 294 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వీటి ద్వారా 2,40,531 టన్నుల ధాన్యాన్ని అధికారులు ఖరీదు చేశారు.

కొనుగోలు నుంచి.. బిల్లులు చెల్లింపుల దాకా చకచకా..

ఏటా జిల్లాలో వరి కోతలు ముందస్తుగానే జరుగుతుంటాయి. అయితే కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, కొనుగోళ్ల ప్రక్రియ ఆలస్యం కారణంగా ఏటా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించి కాంటాలు ఆలస్యం కాకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వచ్చినట్లుగా మిల్లులకు చేరింది. ఇక బిల్లులు సైతం వడ్లు కొనుగోలు చేసిన మూడు నాలుగు రోజుల్లోనే ఖాతాల్లో జమ అయ్యేలా ప్రక్రియను వేగవంతం చేశారు. 2.40 లక్షల టన్నులకు గాను రూ.529.84 కోట్లను రైతులకు చెల్లించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.523.24 కోట్లను కర్షకుల ఖాతాల్లో జమ చేశారు. ఇక కేవలం రూ.6.06 కోట్లను మాత్రమే చెల్లించాల్సి ఉంది. ఈ డబ్బులు సైతం వివిధ దశల్లో ఉండగా మూడునాలుగు రోజుల్లోనే రైతులకు అందనున్నాయి.

క్లుప్తంగా

కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలు

మిర్యాలగూడ: దామరచర్ల మండల కేంద్రంలోని ఎరనాము కాలనీలో గురువారం కుక్కల దాడిలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. తాము ఇళ్ల ముందు ఉండగా.. కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి గాయపరిచాయని బాధితులు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స చేయించుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు.

కంటైనర్‌లో 104 ఆవు దూడల తరలింపు

- రామాపురం క్రాస్ రోడ్ వద్ద పట్టుకున్న పోలీసులు

కోదాడరూరల్: ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్‌కు ఒకే కంటైనర్‌లో 104 ఆవు దూడలను అక్రమంగా తరలిస్తుండగా.. కోదాడ రూరల్ పోలీసులు గురువారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అజీజ్‌ఖాన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్టీఆర్ కృష్ణా జిల్లా బాపులపాడు మండల పరిధిలోని హనుమాన్ జంక్షన్ నుంచి ఒకే కంటైనర్‌లో 104 ఆవు దూడలను కుక్కి హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్నాడు. ఈ క్రమంలో రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడలోని రామాపురం క్రాస్‌రోడ్‌లో వాహనాల తనిఖీల్లో భాగంగా పోలీసులు కంటైనర్ ఆపి చూడగా ఆవు దూడలు కనిపించాయి. పట్టుబడిన ఆవు దూడలను హైదరాబాద్‌లోని జియాగూడలో గల గోశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మహ్మద్ అజీజ్‌ఖాన్‌తో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతి

నల్లగొండ క్రైం: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లి యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని పానగల్ చెరువు(ఉదయ సముద్రం)లో జరిగింది. వివరాలు. నల్లగొండ పట్టణంలోని మాన్యంచెల్కకు చెందిన అంజద్‌ఖాన్(25) తన స్నేహితుడు వాహిద్ అలీతో కలిసి బుధవారం సాయంత్రం చందనపల్లి గ్రామం వైపు పానగల్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. చెరువులో గుంతలు ఉన్న విషయం తెలియక గాలం వేసుకుంటూ ముందుకు వెళ్లిన అంజద్‌ఖాన్ గుంతలో పడిపోయాడు. అంజద్‌ఖాన్‌ను కాపాడేందుకు వాహిద్ అలీతో పాటు అదే సమయంలో అక్కడకు చేపలు పట్టేందుకు వచ్చిన పాలడుగు కృష్ణ ప్రయత్నం చేసినప్పటికీ అతడు మునిగిపోయాడు. బుధవారం రాత్రి వరకు అంజద్‌ఖాన్ కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. గురువారం మధ్యాహ్నం అతడి మృతదేహం చెరువులోని నీటిపై తేలింది. మృతుని భార్య నాజియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లగొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి నాలుగు నెలల క్రితమే వివాహమైంది.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి

అడ్డగూడూరు: ఉపాధి హామీ కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటన గురువారం అడ్డగూడూరు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో జరిగింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా మండల పరిధిలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 10మంది కూలీలు పనులు చేస్తుండగా.. ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. తుప్పతి రాములు, నారబోయిన అంజయ్య, బాలెంల సోమయ్యపై తీవ్రంగా దాడి చేయడంతో వారిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి, అనంతరం 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చిన్నారి హత్య కేసులో నిందితుడి అరెస్ట్




వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ రవి

చివ్వెంల(సూర్యాపేట): వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని చిన్నారిని నేలకేసికొట్టి హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట డీఎస్పీ రవి తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను గురువారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులకు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా గుండారం మండల కేంద్రానికి చెందిన బొల్లంక అరవిందరెడ్డి అదే గ్రామానికి చెందిన రమ్య అలియాస్ నవ్యశ్రీతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. రమ్యకు, ఆమె భర్తకు ఏడు నెలల క్రితం గొడవలు జరగడంతో ఆమె తన తల్లిగారి ఊరైన అదే జిల్లాలోని రంజల్ మండలం సాటాపూర్‌కు తన ఇద్దరు కుమార్తెలను తీసుకొని వెళ్లింది. ఈ క్రమంలో అరవిందరెడ్డి 20రోజుల క్రితం రమ్య తల్లిగారి ఊరికి వెళ్లి ఆమెతో పాటు తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని బైక్‌పై చివ్వెంల మండల ఐలాపురం గ్రామానికి వచ్చి పరకాల పరుశరాములు ఇంట్లో ఒక గది అద్దెకు తీసకుని ఉంటున్నారు. అరవిందరెడ్డి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రమ్యతో ఏకాంతంగా గడిపేందుకు ఆమె చిన్న కుమార్తె మహన్వి(22 నెలలు) అడ్డుగా ఉంటుందని అరవిందరెడ్డి ఆ చిన్నారిని కొట్టడం, కాల్చడం వంటివి చేస్తూ ఇబ్బందులకు గురిచేశాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం రమ్య స్నానానికి వెళ్లిన సమయంలో చిన్నారిని కూలర్‌పై కూర్చోబెట్టి కిందకు నెట్టాడు. దీంతో చిన్నారి తల నేలకు తగిలి స్పృహ కోల్పోయింది. స్నానానికి వెళ్లి వచ్చిన రమ్యకు మెట్ల పైనుంచి పడిందని చెప్పడంతో వెంటనే హస్పిటల్‌కు తీసుకువెళ్లారు. అప్పటికే చిన్నారి మృతిచెందిందని వైద్యులు తెలుపడంతో తిరిగి ఐలాపురం గ్రామం తీసుకొచ్చారు. రమ్య అత్త చిన్నారి మృతికి అరవిందరెడ్డి కారణమని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అతడు పరారయ్యాడు. గురువారం ఐలాపురం గ్రామంలో ఉన్న తన బైక్ తీసుకుని వెళ్లేందుకు అరవిందరెడ్డి రాగా పోలీసుల అతడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ వై. సురేందర్‌రెడ్డి, ఎస్ఐ బి. వెంకట్ రెడ్డి, ఏఎస్ఐలు వెంకన్న, నర్సయ్య, కానిస్టేబుళ్లు గోవర్ధన్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ డాక్యుమెంటరీగా ‘యూనిటీ’

- అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ – 2024కు ఎంపిక



యూనిటీ వాల్‌పోస్టర్

భూదాన్‌పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లికి చెందిన యువ దర్శకుడు భోగ విజయ్‌కుమార్ దర్శకత్వంలో, చిరందాసు ధనుంజయ్య నిర్మాణ సారథ్యంలో రూపొందిన ‘యూనిటీ– ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్’ చిత్రం పగేంట్ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ –2024కు ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రంగా ఎంపికైంది. స్వాతంత్య్ర సమరయోధుడు, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ నాయకుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితచరిత్ర ఆధారంగా ‘యూనిటీ–ది మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్’ చిత్రాన్ని నిర్మించారు. పగేంట్ అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్‌కు ప్రపంచ వ్యాప్తంగా 400 పైగా చిత్రాలు ఎంట్రీలు రాగా, అందులో 38 చిత్రాలు అవార్డు కేటగిరీకి ఎంపికయ్యాయి. కోల్‌కతాలోని స్టార్ థియేటర్ హాల్‌లో జులై 29 నుంచి ఆగస్టు 1 వరకు నిర్వహించే చిత్ర ప్రదర్శనలో పురస్కారం అందుకోనున్నట్లు దర్శక, నిర్మాతలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

మనస్సును కదిలించిన వానర ప్రేమ



మృతిచెందిన కోతి వద్ద వానరాలు

పెద్దవూర : మనిషికి మనిషి సాయం చేయని ఈరోజుల్లో.. నోరు లేకున్నా మాకు మనస్సు ఉందని నిరూపించాయి రెండు వానరాలు. వివరాలు..మండలంలోని బెట్టలతండా వద్ద నాగార్జున సాగర్–హైదరాబాద్ రహదారిపై గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదానికి గురై ఓ కోతి మృతి చెందింది. రోడ్డుపై పడి ఉన్న ఆ కోతిని చూసి అటుగా వచ్చిన మరో రెండు వానరాలు రోడ్డు మీద నుంచి కదలించడానికి శతవిధాలుగా ప్రయత్నించాయి. మృతిచెందిన కోతి వద్దకు ఎవరినీ రానివ్వకుండా అడ్డుకున్నాయి. ఎటువంటి చలనం లేకపోవడంతో ఆ వానరాలు ఎటూ పాలుపోని స్థితిలో సుమారు గంటసేపు కొట్టుమిట్టాడాయి. మృతిచెందిన కోతిని ఎట్టకేలకు ఈడ్చుకుంటూ రోడ్డు పక్కన ఉన్న పొదల్లోకి తీసుకెళ్లాయి. ఈ ఘటన అక్కడ ఉన్న వారి మనస్సును కదిలించింది.

బస్సులో పోగొట్టుకున్న నగదు అప్పగింత



బాధితులకు నగదు అప్పగిస్తున్న సీఐ చరమందరాజు, ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్: ఆర్టీసీ బస్సులో పోగొట్టుకున్న నగదును పోలీసులు తిరిగి బాధితులకు అప్పగించారు. సీఐ చరమందరాజు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ మండల పరిధిలోని ఫణిగిరి గట్టుతో వద్ద నివాసముండే ఆవుల శంభయ్య, లక్ష్మి భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మేడారం, భద్రాచలం, కురివి తదితర ప్రాంతాలలోని దేవాలయాల వద్ద భిక్షాటన చేసి రూ.34వేల నగదు పోగు చేశారు. బుధవారం రాత్రి కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు మిర్యాలగూడ డిపోకు చెందిన ఆర్టీసీలో బయల్దేరారు. రాత్రి 11గంటల సమయంలో హుజూర్‌నగర్‌లో దిగి నగదు, దుస్తులు ఉన్న సంచిని బస్సులోనే మర్చిపోయారు. బస్సు వెళ్లి తర్వాత సంచి లేదని గుర్తించి వెంటనే పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు తీసుకున్న ఏఎస్ఐ రమేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ, హోంగార్డులు చిన్నప్ప, గోపయ్య కలిసి మిర్యాలగూడ ఆర్టీసీ డిపో సహకారంతో బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి నగదు, దుస్తులు ఉన్న సంచిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం నగదును సంచిని హుజూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య, ఏఎస్ఐ బలరామిరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో రూ.కోటి నగదు స్వాధీనం

నల్లగొండ క్రైం: నల్లగొండ రైల్వే స్టేషన్‌లో గురువారం ఆర్‌పీఎఫ్ పోలీసులు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళుతున్న పల్నాడు రైలు జనరల్ బోగీలో తనిఖీ నిర్వహించగా మిర్యాలగూడకు చెందిన ఒక వ్యక్తి దగ్గర రూ.కోటి 28 లక్షల నగదు లభించింది. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో రైల్వే పోలీసులు ఆ నగదును ఇన్‌కంటాక్స్ అధికారులకు అప్పగించారు. బంగారం కొనేందుకు హైదరాబాద్ వెళుతున్నట్లు బాధితుడు పోలీసులకు తెలిపాడు.

మహిళను బావిలోకి తోసేసిన యువకుడి అరెస్ట్

మోత్కూరు: మహిళను బావిలోకి తోసేసిన యువకుడిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ఎస్. వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి జిల్లా కేంద్రంలోని కాకినాడ బస్తీకి చెందిన మాటూరి కవిత, భువనగిరి మండలం ముత్తిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన మాకోళ్ల నర్సింహులు బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కవిత బంధువుల ఇంటికి వచ్చారు. వీరు స్థానికంగా ఉన్న పెద్ద చెరువు సమీపంలోని ముత్యాలమ్మ వ్యవసాయ బావి వద్ద ఈత కొట్టేందుకు వెళ్లారు. ఆ సమయంలో కవితను నర్సింహులు బావిలోకి నెట్టేయడంతో ఈత రాక ఆమె మృతిచెందింది. ఘటనా స్థలం నుంచి పారిపోయిన నిందితుడు నర్సింహులును గురువారం స్థానికంగా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. నర్సింహులు, కవిత మధ్య వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్‌పై వెళ్తూ చెట్టును ఢీకొట్టిన వ్యక్తికి గాయాలు



ఘటనా స్థలంలో గాయపడిన కోటేశ్వర్‌రావు

కట్టంగూర్: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టి వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామ శివారులో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరుకు చెందిన కోటేశ్వర్‌రావు కూలీ పనుల కోసం తన భార్య, కుమారుడితో కలిసి రెండు రోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో తన భార్య, కుమారుడిని రైలు ఎక్కించి బైక్‌పై అతడు గుంటూరుకు బయల్దేరాడు. మార్గమధ్యలో కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామశివారులోకి రాగానే బైక్ అదుపుతప్పి విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కోటేశ్వర్‌రావు తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు చికిత్స నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయాలి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీఎంపీ, ఆర్ఎంపీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్: గ్రామీణ వైద్యులపై దాడులను నిలిపివేయాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి తన క్యాంపు కార్యాలయంలో పీఎంపీ, ఆర్ఎంపీ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నేతి రాజేశ్వర్‌రావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పానుగోటి హనుమంతరావు మాట్లాడుతూ.. గ్రామీణ వైద్యుల క్లినిక్‌లపై పోలీసులతో కలిసి వచ్చి దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సీఎంకు వివరించారు. తాము గతంలో ప్రభుత్వం నుంచి శిక్షణ తీసుకుని సర్టిఫికెట్లను కూడా పొందామని, ప్రస్తుతం కూడా తమకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని సీఎంను కోరారు. వెంటనే తగిన న్యాయం చేస్తానని దాడులు నిలిపివేయిస్తామని సీఎం హామీ ఇచ్చారని వారు చెప్పారు. వినతిపత్రం అందజేసిన వారిలో సుశృత గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకుడు డి. సత్యనారాయణచారి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు అంబటి చెన్న కృష్ణయ్య, కార్యదర్శి కందగట్ల లక్ష్మణ్‌గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎలికట్టె వాసికి డాక్టరేట్



మిర్యాల శ్వేత

చిట్యాల: మండలంలోని ఎలికట్టె గ్రామానికి చెందిన మిర్యాల శ్వేతకు ఉస్మానియా యూనివర్సిటీ అధికారులు గురువారం డాక్టరేట్ ప్రకటించారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పి.వెంకటయ్య పర్యవేక్షణలో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ‘ప్రైవేట్ అండ్ గవర్నమెంట్ హాస్పిటల్స్ ఇన్ సెలెక్ట్ డిస్ట్రిక్స్ ఇన్ తెలంగాణ స్టేట్ టు స్టడీ ద ఇన్‌ఫ్లూయన్స్ ఆఫ్ స్లీప్ డీప్రివేషన్ ఆన్ హెల్త్’ అనే అంశంపై చేసిన పరిశోధనకుగాను ఆమెకు డాక్టరేట్ లభించింది. తన భర్త గంజి సంతోష్‌కుమార్ సహకారంతోనే డాక్టరేట్ పూర్తి చేసినట్లు శ్వేత తెలిపింది.

ఇసుక డంప్ స్వాధీనం

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలో అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌ను రెవెన్యూ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. తహసీల్దార్ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలంలోని చింతిర్యాల పునరావాస కేంద్రం శివారులో అక్రమంగా నిల్వ చేసిన సుమారు 75 ట్రక్కుల ఇసుక డంప్‌ను స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ సైదా పంచనామా నిర్వహించి ఇసుక డంప్‌ను పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు అప్పగించారు. ఈ ఇసుకను త్వరలో వేలం వేయనున్నట్లు తెలిపారు.

గడ్డివాము దగ్ధం.. పోలీసులకు ఫిర్యాదు

నడిగూడెం : మండల పరిధిలోని కరివిరాలలో బుధవారం రాత్రి గడ్డివాము దగ్ధమైంది. గ్రామంలో మిడిదొడ్డి సరోజనమ్మకు చెందిన గడ్డివాము తన ఇంటి ఆవరణలో ఉండగా గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో దాదాపు 100కు పైగా గడ్డి మోపులు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన పలువురు అనుమానితులపై గురువారం ఆమమె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. కావాలనే గడ్డివాముకు నిప్పంటించారని, నిందితులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

లాసెట్‌లో పోతునూరు వాసికి ఆరో ర్యాంక్



నెర్మటి అర్జున్‌రెడ్డి

పెద్దవూర: రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన లాసెట్ ఫలితాల్లో పెద్దవూర మండలం పోతునూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఏనెమీదిగూడెం గ్రామానికి చెందిన నెర్మటి అర్జున్‌రెడ్డి రాష్ట్ర స్థాయిలో ఆరో ర్యాంక్ సాధించాడు. నెర్మటి కోటిరెడ్డి, యాదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. నెర్మటి అర్జున్‌రెడ్డి చిన్న కుమారుడు. వీరిది మధ్య తరగతి వ్యవసాయ కుటుంబం. అర్జున్‌రెడ్డి ఆరో తరగతి నుంచి ఏడో తరగతి వరకు మండల కేంద్రంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో, ఎనిమిది నుంచి పదో తరగతి వరకు నల్లగొండలోని సాందీపని ఉన్నత పాఠశాలలో చదివాడు. ఇంటర్ హైదరాబాద్‌లోని వికాస్ జూనియర్ కళాశాలలో, జెబీఐఈటీ(జోగిన్‌పల్లి భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ)లో బీటెక్ పూర్తి చేశాడు. అర్జున్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.57,13,100



హుండీల్లోని నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నార్కట్‌పల్లి : మండలంలోని చెర్వుగట్టు గ్రామంలోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను గురువారం లెక్కించారు. 78 రోజుల్లో రూ.57,13,100 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్, సూపరింటెండెంట్ తిరుపతిరెడ్డి, ప్రధాన అర్చకుడు రామలింగేశ్వర శర్మ, సీనియర్ అసిస్టెంట్లు ఇంద్రసేనారెడ్డి, శంకర్, రవీందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, నర్సిరెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- ట్రాఫిక్ సిగ్నల్స్ రెడీ..



నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్, సుభాష్ విగ్రహం, దేవరకొండ రోడ్డు, ఎన్టీఆర్ విగ్రహం, ఎన్జీ కాలేజ్, వీటి కాలనీ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మరో వారం రోజుల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ రెడీ కానున్నాయి. గతంలోనూ నల్లగొండ పట్టణంలోని వివిధ కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉండగా.. రోడ్ల విస్తరణలో భాగంగా వాటిని తొలగించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ


పట్టుబడిన వాహనాల వేలం



వేలం నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

తుంగతుర్తి: మండల కేంద్రంలోని ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో వివిధ తనిఖీల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం వేలం నిర్వహించారు. సూర్యాపేట జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ.. 12 ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహించగా 8 వాహనాలను పలువురు దక్కించుకున్నట్లు తెలిపారు. ఈ వేలం ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.2.95 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రజిత, టీడీఎఫ్ సీఐ మల్లయ్య, ఎస్ఐలు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల సాగుకు రైతులు మొగ్గు



పెద్దవూర: వరి పంటకు ప్రత్యామ్నాయంగా రైతులు చిరు ధాన్యాల పంటలైన జొన్న, సజ్జ, రాగి, కొర్రలు సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు, అధిక లాభాలు పొందవచ్చునని ఇన్‌చార్జి ఏడీఏ సందీప్‌కుమార్ సూచించారు. చిరుధాన్యాలు రక్తపోటు, మధుమేహం, ఊబకాయం సమస్యలతో బాధపడే వారికి మేలు చేస్తాయని నిపుణులు కూడా చెబుతున్నారు. వానాకాలంలో సాగు చేసే చిరుధాన్యాలలో అవసరాన్ని బట్టి ఒకటి నుంచి రెండు తడులు ఇస్తే సరిపోతుంది.

1. జొన్న: వానాకాలంలో నల్లరేగడి, తేలికపాటి నేలలు జొన్న పంటకు అనుకూలం. ఈ సీజన్‌లో తొలకరి వర్షాలు కురవగానే వర్షపాతం ఆధారంగా జూన్ మొదటి వారం నుంచి జూలై చివరి వారం వరకు జొన్న విత్తుకోవాలి. విత్తడం ఆలస్యమైతే కాండం తొలుచే పురుగు ఉధృతి పెరుగుతుంది.

రకాలు: హైబ్రీడ్ రకాలైన సీఎస్‌హెచ్ 14, 16, 18, 21తో పాటు ప్రాచుర్యం పొందిన ప్రైవేట్ కంపెనీల హైబ్రీడ్ రకాలను సాగు చేయవచ్చు. హైబ్రీడ్ రకాలలో ఎకరాకు 12 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి పొందవచ్చు. సాధారణ రకాలైన సీఎస్‌వీ 15, శ్రీశైల(పీఎస్‌వీ–56) రకాలు సాగు చేయవచ్చు. ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

విత్తే విధానం: ఎకరాకు 3 నుంచి 4 కిలోల జొన్న విత్తనం విత్తుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 12 నుంచి 15 సెంటీమీటర్ల దూరం ఉండేలా విత్తకోవాలి.

విత్తనశుద్ధి: విత్తే ముందు కిలో విత్తనానికి మూడు గ్రాములు థయోమీ థక్సం, మూడు గ్రాములు కాప్టాన్ లేదా థైరామ్ మందును కలిపి విత్తన శుద్ధి చేయాలి.

ఎరువుల యాజమాన్యం: ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువుతో పాటు 32–24–18 కిలోలు చొప్పున నత్రజని–భాస్వరం–పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

అంతర పంట: జొన్నలో కందిని అంతర పంటగా 2:1 నిష్పత్తిలో సాగు చేసుకోవచ్చు. విత్తిన 42 గంటల్లోపు లీటరు నీటికి 4 గ్రాములు అట్రజిన్ కలుపు మందును కలిపి పిచికారీ చేస్తే మొదటి దశలో వచ్చే కలుపును నివారించవచ్చు. జొన్నలో ఎక్కువ కష్టం కలిగించే మల్లె (కలుపు) నివారణకు లీటర్ నీటికి 50 గ్రాముల అమ్మోనియం సల్ఫేట్ లేదా 2.4–డి సోడియం సాల్ట్ 2 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.



సజ్జ పంట

2. సజ్జ: సజ్జ పంటను జూన్ రెండో వారం నుంచి జూలై మూడో వారం వరకు విత్తుకోవచ్చు.

రకాలు: ఐసీఎంహెచ్ 356(హైబ్రీడ్), పీహెచ్‌బీ3, ఏహెచ్‌బీ 1 పేరున్న హైబ్రీడ్ రకాలను సాగుకు ఎంచుకోవాలి. ఎకరాకు 1.6 కిలోల విత్తనం వాడుకోవాలి. వరుసల మధ్య 45 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 45 సెంటీమీటర్లు దూరంలో విత్తుకోవాలి.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి కాప్టాన్ లేదా 3గ్రాముల థైరామ్ కలిపి విత్తనశుద్ధి చేసి విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: ఒక టన్ను పశువుల ఎరువుతో పాటు ఎకరాకు వర్షాధార పంటకు 24–12–8 చొప్పున, నీటి వసతి కింద 32–16–12 కిలోల చొప్పున నత్రజని–భాస్వరం–పొటాష్ ఎరువులను వేసుకోవాలి. నత్రజని ఎరువును రెండు దఫాలుగా పంట విత్తేటప్పుడు, విత్తిన 30 నుంచి 35 రోజులకు వేయాలి. రెండు సాళ్ల సజ్జ పంటకు ఒక సాలు కంది పంటను అంతర పంటగా వేసుకోవచ్చు. జొన్న పంటలో సూచించిన మాదిరి అట్రజిన్ కలుపు మందుతో కలుపును నివారించాలి. పంట కీలక దశల్లో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. సజ్జ పంట 70 నుంచి 80 రోజులలో కోతకు వచ్చి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

3. కొర్ర: కొర్రలను జూలై, ఆగస్టు మాసాలలో విత్తుకోవాలి. కొర్ర పంట 70 నుంచి 85 రోజులలో కోతకు వస్తుంది. కొర్రలో ప్రసాద్, కృష్ణదేవరాయ, శ్రీలక్ష్మీ, సూర్యనంది, ఎస్ఐఏ 3085, ఎస్ఐఏ 3156 రకాలు అనుకూలం. పప్పుశనగకు ముందు 70–75 రోజులలో సూర్యనంది కొర్రలు సాగు చేసి శనగ వేసుకుంటే నికర ఆదాయం పెరుగుతుంది.

విత్తనశుద్ధి: ఎకరాకు సాళ్లలో విత్తేతే 9 కిలోలు, వెదజల్లే పద్ధతిలో అయితే 4కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి కార్బండిజం 2 గ్రాములు కలిపి విత్తనశుద్ధి చేసి సాళ్ల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్లు ఎడం ఉండేలా విత్తుకోవాలి. విత్తిన 20 నుంచి 25 రోజులకు సాళ్లలో అంతర కృషిచేసి కలుపు నివారించాలి.

ఎరువుల యాజమాన్యం : ఎకరాకు రెండు టన్నుల పశువుల ఎరువు, 8 కిలోల నత్రజని, 17 కిలోల భాస్వరం వేసుకోవాలి.

4. రాగి: వానాకాలంలో రాగి పంటను జూలై నుంచి ఆగస్టు వరకు విత్తుకోవచ్చు. రాగి పంట 80 నుంచి 115 రోజులలో చేతికి వస్తుంది. స్వల్పకాలిక రకాలైన మారుతి, చంపావతి, 80 నుంచి 90 రోజుల్లో, మధ్యకాల రకాలైన సప్తగిరి, భారతి, గోదావరి, 100 నుంచి 115 రోజుల్లో, పీపీఆర్ 1012 రకం 115 నుంచి 120 రోజులలో పంట కోతకు వచ్చి ఎకరాకు 12 నుంచి 14 క్వింటాళ్ల దిగుబడి ఇస్తాయి. రాగిని నేరుగా విత్తనాన్ని వెదజల్లి నారు పెంచి నాటే విధానంలో సాగు చేయవచ్చు. ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది.

విత్తనశుద్ధి: కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి. విత్తనాన్ని వరుసల మధ్య 15 నుంచి 20 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 15 సెంటీమీటర్ల దూరంలో విత్తుకోవాలి.

ఎరువుల యాజమాన్యం: నారుమడికి 640 గ్రాముల లెక్కన నత్రజని, భాస్వరం, 480 గ్రాముల పొటాష్ ఇచ్చే ఎరువులు వేసుకోవాలి. ప్రధాన పొలంలో నాలుగు టన్నుల పశువుల ఎరువులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోలు నత్రజని, 8 కిలోల పొటాష్, 12 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులు విత్తేటప్పుడు లేదా నాటేటప్పుడు వేసుకోవాలి. విత్తనాన్ని వెదజల్లేటప్పుడు భూమిని మెత్తగా తయారు చేసి విత్తనాన్ని సమానంగా చల్లుకోవాలి. విత్తనం చల్లిన తర్వాత బల్లతో గాని, చెట్టు కొమ్మతో గాని చదును చేసుకోవాలి. విత్తిన వెంటనే మొలకలు రాక ముందు లీటర్ నీటిలో 3 మిల్లీ లీటర్లు పెండి మిథాలిన్‌ను కలిపి పిచికారీ చేయాలి. నాటిన 15 నుంచి 18 రోజులకు వెడల్పాటి కలుపు మొక్కలు ఉంటే 2,4–డీ సోడియం సాల్టును రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకుని కలుపు నివారించుకోవాలి.